06ATP20_06ATP20.qxd 20-11-2022 PM 10:51 Page 1



## పుస్తక పఠనం మనోవికాసానికి ఉపయోగం

**కళ్యాణదుర్గం, నవంబర్ 20 ప్రభాతవార్త**



గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సన్మానిస్తున్న దృశ్యం

పుస్తక పఠనం విజ్ఞానానికి, మనోవికాసానికి, క్రమశిక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని, గ్రంథాలయాలు పుస్తక ప్రియులకు జ్ఞానమందిరాలుగా ఉంటాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాల అవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గ్రంథాలయాధికారి శ్రీనివాసులు అధ్యక్షత వహించగా విద్యామందిరం ప్రధానాచార్యులు కరణం తిరుమలరావు, ప్రధానోపాధ్యాయులు తిప్పేస్వామి, భాగ్యమ్మ, భాస్కర్, రాజన్న, సామాజిక సేవా అవార్డు గ్రహీత కిశోర్‌కుమార్‌లు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీ పరీక్షల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేసారు. అలాగే సామాజిక సేవా అవార్డు గ్రహీత కిశోర్‌కుమార్‌ను దుశ్శాలువతో ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేసారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల విద్యార్థులు, అధ్యాపకబృందం పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడు వెంకటరమణప్పకు ఘననివాళి



వెంకటరమణకు నివాళులర్పిస్తున్న దృశ్యం

**కళ్యాణదుర్గం, నవంబర్ 20 ప్రభాతవార్త**

విశ్రాంత ఉపాధ్యాయుడు, ఎపిటిఎఫ్ ఉద్యమనాయకుడు వెంకటరమణప్ప విద్యారంగానికి, ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడుగా అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు విశ్రాంత ఉద్యోగులు, ఎపిటిఎఫ్ నాయకులు పేర్కొన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటరమణప్ప మరణించడంతో అయన భౌతిక కాయానికి పలువురు విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సహచరులు, బంధువులు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎందరినో ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దారని, ఉద్యమ నాయకుడుగా ఉపాధ్యాయులు ఎందుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేసారని, అయన అత్మకు శాంతి కలగాలని సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శివప్రసాద్, తిప్పేస్వామి బృందం, ఎపిటిఎస్ జిల్లా అధ్యక్షులు రాయల వెంకటేశులు బృందం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సంజీవప్ప, ఇతర సిపిఐ నాయకులు, వినియోగదారుల సంఘం అధ్యక్షులు కిశోర్‌కుమార్, జర్నలిస్టుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లింగ ప్రసాద్, సన్నిహితులు ఈరన్న, రాజకీయ నాయకులు నివాళులర్పించారు.

## అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిపి

**బ్రహ్మసముద్రం నవంబర్ 21 ప్రభాతవార్త**



అవాస్‌యోజనపై అవగాహన దృశ్యం

మండలంలోని పిల్లలపల్లి గ్రామంలో మంత్రి ఉషాశ్రీ చరణ్ అదేశాలమేరకు ఎంపిపి కంభం చంద్రశేకర్ రెడ్డి అధ్వర్యంలో ప్రదాన మంత్రి అవాస్‌యోజన వైయస్ఆర్ గ్రామీణ్ లబ్ది దారులకు అవగాహన కార్యక్రమంను నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు ప్రతిఒక్కరూ ప్రదానమంత్రి అవాస్ యోజనలో మంజూరైన గృహాలను నిర్మించుకోవాలని అధికారులు అన్ని విదాలా సహాయ పడతారని వివరించారు. కార్యక్రమంలో భాగంగా లబ్దిదారులు బి అంజినమ్మ రాజులకు ప్రదానమంత్రి అవాస్‌యోజన మంజూరైన గృహాలను అధికారులతో కలిసిగ్రౌండింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తలారి గోవిందప్ప, మాజి సర్పంచ్ వెంకటేశులు, హనుమంతరెడ్డి సచివాలయ సిబ్బంది పాల్గోన్నారు.

## ఘనంగా అఖీలభారత సహకార వారోత్సవాలు

**బ్రహ్మసముద్రం నవంబర్ 21 ప్రభాతవార్త**



వారోత్సవాల దృశ్యం

69వ అఖీలభారత సహకార వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా మండలంలోని భైరవానితిప్ప సహకార సంఘం కార్యాలయంలో అదివారం వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రఫటానికి పూల మాల వేసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘపు డైరెక్టర్ సుమంఘళమ్మ, రాజు, తిప్పేస్వామి, ప్రశాంత్‌రెడ్డి, లింగప్ప, సిబ్బంది పాల్గోన్నారు

## ఉచిత గుండె కంటి పరీక్షల వైద్య శిబిరం

**కుందుర్పి, నవంబర్,20ప్రభాతవార్త**



గుండే పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సురేష్

కరువు సీమలో దినదిన గండంగా కష్టాల సుడిగుండంలో పుట్టి పేరిగినా జన్మభూమి ఋణం తీర్చు కొనేందుకు చేంజ్ ఫర్ సొసైటీ స్థాపించి సమాజ సేవలో ముందు వరుసలో వుండాలని సొసైటీ వ్యవస్థాపకుడు జబివుల్లా షేక్ ప్రభాతవార్తతో పేర్కొన్నారు మండల కేంద్రం ప్రభుత్వ మెయిన్ స్కూల్ అవరణంలో చేంజ్ ఫర్ సొసైటీ అధ్వర్యంలో ఉచిత గుండే కంటి వైద్యశిబిరం నిర్వ హించడం జరిగింది జబివుల్లాషేక్ మాట్లాడుతూ గుండే పరీక్షలు కంటి పరీ క్షలు 400మందికి చేయించడం జరిగిందని నంద్యాలలోని శాంతిరామ్ సూ పర్ స్పెషాలీటీ హాస్పటల్‌కు పంపడం జరుగుతుందని తెలిపారు. నంద్యాలకు పోవడానికి రావడానికి బస్సులు ఏర్పాటు చెయ్యడం జరిగిందని పేర్కొన్నారు ఈకార్యక్రమానికి డాక్టర్ల బృందం సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు

## అయ్యప్ప ఆలయంలో అన్నదాన కార్యక్రమానికి విరాళాలు

**-అన్నదాన సేవా సమితి సభ్యులు మాలపాటి బ్రహ్మనాయుడు**

**ఉరవకొండ, నవంబర్ 20 ప్రభాతవార్త**

ఉరవకొండ పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో మాలదారులకు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి కర్నాటకకు చెందిన పలువురు భక్తులు నిత్యవసరాలు, నగదును విరాళంగా అందజేశారని అన్నదాన సేవా సమితి సభ్యుడు మాలపాటి బ్రహ్మనాయుడు తెలిపారు. బళ్లారికు చెందిన పార్వతీ రోడ్‌లైన్స్ అధినేత గిరిధర్‌రెడ్డి ఒక క్వింటాల్ కందిబేడలు, హమాలీ మేస్త్రీ భవానిస్వామి, శ్రీనివాసులు ఒక బస్తా బియ్యం, పీఆర్ రోడ్‌లైన్ అధినేత లక్ష్మన్న క్వింటాల్ బియ్యాన్ని, మణికంఠ బస్సు అధినేత శ్రీనివాసులుబాబు 5,116 రూపాయలు నగదును అందజేశారని ఆయన వివరించారు. నిత్యన్నదానికి విరాళాలు అందించిన దాతలకు ఆయప ధన్యవాదాలు తెలిపారు.

## గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

**పుట్టపర్తిటౌన్, నవంబర్ 20, ప్రభాతవార్త**

55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం పుట్టపర్తి గ్రంథాలయం నందు నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విశ్రాంత మండల అధికారి నాగిరెడ్డి మరియు ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులుగా మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రతి గ్రామంలో డిజిటల్ లైబ్రరీలు ఉండాలని, అనంతపురం, చిత్తూరు, విశాఖ, తూర్పుగోదావరి జిల్లాలో డిజిటల్ లైబ్రరీల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారన్నారు. డిజిటల్ లైబ్రరీల వలన విద్యార్థులకు పోటీ పరీక్షల్లో అవసరమయ్యే అనేక పుస్తకాలు అందుబాటులో ఉంటాయని, విద్యార్థులు, యువకులు, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా ఉదయం, సాయంత్రం గ్రంథాలయాలకు వెళుతూ దిన, వార, మాస పత్రికలలో వచ్చే అంశాలను చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. అనంతరం గ్రంథాలయ అధికారి వెంకటరమణ మాట్లాడుతూ, విద్యార్థులు సభ్యత్వం తీసుకొని వారికి కావాల్సిన పుస్తకాలు ఇంటికి తీసుకెళ్ళి వాటిని చదువుకొని తిరిగి 14 రోజులలోపు తిరిగి ఇవ్వవచ్చన్నారు. అనంతరం వారోత్సవాలలో వివిధ విభాగాలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## శవపేటికల (బాడీఫ్రీజర్స్)కు ఆర్థిక సాయం అందించిన దాతలకు సన్మానం

**గోరంట్ల, నవంబర్ 20 ప్రభాతవార్త**

మండల పరిధిలో ఎవరైనా మృతి చెందితే వారి మృతదేహాలను తాత్కాలికంగా వుంచేందుకు బాడీఫ్రీజర్స్ (శవపేటికలు) మరియు మృతదేహాలను స్మశానవాటికకు తీసుకెళ్లేందుకు వైకుంఠరథం కొనుగోలుకు దాతలు ఆర్థిక సాయం అందించాలని పంచాయతీ కార్యదర్శి కోరడంతో దాతలు తమకు తోచిన విధంగా విరాళాలు అందిస్తున్నారు. ఈ క్రమంలో మండల అడ్వైజరీ కమిటీ చైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి, పట్టణానికి చెందిన గ్రౌండ్‌నట్ వ్యాపారవేత్త ఎంవి నాగరాజు వారి కుమారులు మరియు గ్రామ పంచాయతీ బోర్డు సభ్యుల సహాయ సహకారాలతో 3 ఫ్రీజర్‌బాక్స్‌లు 3.15 లక్షలతో కొనుగోలు చేయడం జరిగిందన్నారు.

ఈ బాడీ ఫ్రీజర్స్‌లకు గోరంట్ల మండలంలోని ప్రజలకు అవసరాల మేరకు అంకితం చేయడం జరిగిందని బాడీ ఫ్రీజర్స్‌కు సహాయ సహకారాలు అందించిన దాతలను సోమవారం సర్పంచు సరోజానాగేనాయక్ అధ్యక్షతన గ్రామ పంచాయతీ పరిధిలోని 7వవార్డులో గ్రామ పంచాయతీ కార్యాలయం (సిరికల్చర్ కారాయలయం)లో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వాటితో పాటు గోరంట్ల మండల పెద్దలు, ప్రజల సహకారంతో విరాళాలతో 20 లక్షల విలువ చేసే వైకుంఠ రథాన్ని 2023వ సంవత్సరం జనవరి 15వతేదీలోపు కొనుగోలు చేసి గోరంట్ల మండల ప్రజలకు అంకితం చేయడం జరుగుతుందని వీటి కోసం మండల పరిధిలోని ఎవరైనా సరే కులమతాలు, పార్టీలకు అతీతంగా విరాళం అందిస్తే పంచాయతీ వారు స్వీకరిస్తారని మంచి మనసుతో మానవతా దృక్పథంతో దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందచేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి సతీష్‌కుమార్ కోరారు.

## చిరుత దాడిలో రెండు పొట్టేళ్లు, ఆవు దూడ మృతి

**-ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఫారెస్టు అధికారులు**

**బెలుగుప్ప, నవంబర్ 20 ప్రభాతవార్త**

మండల పరిధిలోని బెలుగుప్ప తండాలో శనివారం రాత్రి చిరుత పులి దాడిచేసి రెండు పొట్టేళ్లు ఒక అవుదూడను చంపింది. బాధితుడు ఆర్.ఉమ్లానాయక్ తెలిపిన మేరకు వివరాల్లోకి వెళితే..రాత్రి 11 గంటల సమయంలో తన బీరతోటలోని పశువుల పాకవద్ద కట్టివుంచిన పొట్టేళ్లు, ఆవుదూడపై చిరుత దాడిచేసి చంపి తిందన్నారు. చిరుత దాడిలో తనకు దాదాపు 40వేల రూపాయలు నష్టవాటిల్లిందన్నారు. విషయం తెలియగానే ఆదివారం ఉదయం ఫారెస్టు అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మరణించిన పొట్టేళ్లు, ఆవుదూడకు పశు వైద్యులచే పోస్టుమార్టం నిర్వహించారు. కాగా చిరుత దాడితో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. చిరుతను బంధించడానికి ఫారెస్టు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## గ్రంథాలయ అభివృద్ధికి సహకరిస్తాం

**-మున్సిపల్‌చైర్‌పర్సన్ వన్నూర్‌బీ**

**గుత్తి, నవంబర్ 20 ప్రభాతవార్త**



బహుమతుల అందచేస్తున్న మున్సిపల్‌చైర్‌పర్సన్

పట్టణంలోని గ్రంథాలయ అభివృద్ధికి తమవంతుగా సహకరిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ పేర్కొన్నారు. 55వ జాతీయ గ్రంథాలయ వార్సోవాల ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పాటు గ్రంథాలయాలను సైతం విద్యార్థులు సద్వినియోగం చేసుకుని వృద్ధిలోకి రావాలని ఆమె పేర్కొన్నారు. అనంతరం వ్యాసరచన, చిత్రలేఖనం, కవిసమ్మేళనం, వకృత్వపు పోటీల్లో విజేలుగా నిలిచిన వారికి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి రామాంజినేయులు, ఉపాధ్యాయులు రామకృష్ణ, కుళ్లాయిబాబు, గోవిందరాజులు, షఫి, తదితరులు పాల్గొన్నారు.

## కోట నిర్మాణాలు అద్భుతం : సిఐ

**గుత్తి, నవంబర్ 20 ప్రభాతవార్త**



గుత్తికోటను సందర్శిస్తున్న సిఐ

శత్రుదుర్బేద్యంగా నిర్మించిన గుత్తికోట బావితరాలకు అందించే విధంగా రూపుదిద్దుకుందని సిఐ వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన కోటను సందర్శించారు. ఈ సందర్భంగా గుత్తికోట సంరక్షణ సమితి చైర్మన్ విజయభాన్కర చౌదరి గుర్రపుశాల, సైనిక శిబిరం, కవాతు ప్రదేశం, సభామండపం, చీకటిగది, మురారీరావు గద్దె, ధాన్యాగారం, ఆయుధాగారం, రాణివాసం గురించి వివరించారు. నిర్మాణాలు అద్భుతమని సిఐ కొనియాడారు. ఈ కార్యక్రమంలో హనుమంతరెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు. అనంతరం కోట తదితర ప్రాంతాల్లో శ్రమదానం చేసి పిచ్చిమొక్కలు తొలగించారు.

## అన్నదాతలను విస్మరిస్తే అదోగతే..!




సమావేశంలో మాట్లాడుతున్న గోవిందు

**గుంతకల్లు టౌన్, నవంబర్ 20 ప్రభాతవార్త**

అన్నదాతలను విస్మరించిన ఏ ప్రభుత్వమైనా అదోగతి పాలు కాకతప్పదని సిపిఐ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోవిందు అన్నారు. వైసిపి ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరిస్తూ ముందుకెళుతోందన్నారు. అధికారం చేపట్టి మూడున్నర సంవత్సరాలు అయిన రైతులకు ఒక్క మేలు కూడా చేయలేకపోయిందన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు యంత్ర పరికరాలు, ఎరువులు సకాలంలో అందించలేదన్నారు. పంటలపై అవగాహన కల్పించలేదన్నారు. సరైన సమయానికి విత్తనాలు అందక చివరి ఆయకట్టుకు నీరు అందక భూములు బీడువారుతున్నాయన్నారు. అలాగే పంటలకు గిట్టుబాటు ధర లేక కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపులు సక్రమంగా చేయలేకపోయిందని ఆరోపించారు. ఈ నెల 23న జిల్లాలోని అన్ని మండలాల తహశీల్దార్ కార్యాలయాల ముందు సిపిఐ, రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి రామురాయల్, నాయకులు దేవేంద్ర, కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

# సాయం అందించండి ప్లీజ్..!

**-పోలియో ఆపై కండరాల వ్యాధిలో కదలలేని దుస్థితి -శాపగ్రస్థుడిగా మారిన ఉరవకొండకు చెందిన 23 ఏళ్ల యువకుడు**

**-వ్యాధి నిర్ధారణ చేసుకోవడానికి కూడా సహకరించని ఆర్థిక పరిస్థితులు -తన కుమారుడికి జీవం పోయాలని వేడుకొంటున్న బాధితుడి తల్లి**



ఇంట్లో కదలలేని స్థితిలో పడుకున్నచోటికే పరిమితమైన పి.తేజేష్‌బాబుతో అతని తల్లి నాగలక్ష్మి

**ఉరవకొండ, నవంబర్ 20 ప్రభాతవార్త**

ఉరవకొండ పట్టణానికి చెందిన పెద్దకోట్ల తేజేష్‌బాబు శాపగ్రస్థుడిగా మిగిలిపోయాడు. 8 సంవత్సరాల వయసులో పోలియో సోకి రెండు కాళ్లు పనిచేయకుండా చొచ్చుబడిపోగా గత 3 సంవత్సరాల క్రితం కుడికాలికి కండరాల వ్యాధి సోకడంతో కదలలేని స్థితిలో పడుకున్నచోటే నేలపై పడి ఉంతన బిడ్డను టున్నాడు. కొడుకును ఎలాగైనా ఉన్నత విద్య చదివించి మంచి స్థాయి తీసుకెళ్లాలన్న తల్లి నాగలక్ష్మి పట్టుదలతో బీకాం కాంప్యూటర్స్ కోర్సు పూర్తీ చేసిన తేజేష్‌బాబుకు నేడు కలిగిన దుస్థితిని చూసి ఆమె కన్నీటి పర్యంతమవుతోంది. తన కొడుకు ఏ వ్యాధితో బాధపడుతున్నాడో కూడా తమకు తెలయదని ఇంటి నుండి బయటకు తీసుకెళ్లి ఆసుపత్రిలో చికిత్స చేయించడానికి కూడా తమవద్ద డబ్బులేదని ఆవేదన వ్యక్తం చేస్తోంది. దివ్యాంగుడైన యువకుడికి ప్రభుత్వం అందించే 5వేల రూపాయల పింఛన్‌తోనే కుటుంబం నడుస్తోందని తమకు సొంత ఇళ్లు కూడా లేదని చెబుతోంది. మంచి మనసున్న దాతలెవరైనా ముందుకొచ్చి ఆర్థిక సాయం అందిస్తే తేజేష్‌బాబును చికిత్సకు తరలిస్తామని చెబుతోంది. వివరాల్లోకి వెళితే...



పి.తేజేష్‌బాబు (ఫైల్‌ఫోటో)

ఉరవకొండ పట్టణంలోని చౌడేశ్వరి కాలనీలో నివశిస్తున్న పెద్దకోట్ల నాగరాజు, నాగలక్ష్మి దంపతులకు ఒక్కగానొక్క కొడుకు తేజేష్‌బాబు. అతను పుట్టినప్పుడు అందరిలా బాగానే ఉన్నా 8 సంవత్సరాల వయస్సులో పోలియో సోకి రెండుకాళ్ళు చొచ్చుబడిపోయాయి. అల్లారుముద్దుగా చూసుకున్న కొడుకు కళ్లముందరే కదలలేని స్థితికి చేరుకోవడంతో రెక్కాడితేగాని డొక్కాడని పేద కుటుంబానికి చెందిన తల్లిదండ్రులు పోలియోను నయం చేయించడానికి ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అయినా కుంగిపోకుండా అతన్ని గుండెలపై మోస్తూ పెంచి పెద్దవాన్ని చేశారా తల్లిదండ్రులు. కూర్చున్న చోటుకే పరిమితయ్యే కొడుకుకు అన్నం తినిపించడం మొదలు కాలకృత్యాలు తీర్చేవరకు అన్ని బాధ్యతలను ఆ తల్లే నిర్వహించింది. ఉదయం లేచిన కాడి నుండి రాత్రి పడుకోబోయే వరకు అతన్ని కంటికి రెప్పలా చూసుకొంటూ అన్నిచోట్ల తోడుగా నిలిచి తన బిడ్డకు మంచి భవిశత్తునివ్వడానికి ప్రభుత్వ ఉద్యోగిని చేయాలని పరితపిస్తూ ట్రై సైకిల్‌లో నిత్యం ఊరి బయట జాతీయ రహదారికి పక్కనగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పిలుచుకొని పోవడం తరగతులు పూర్తీ అయిన తరువాత జాగ్రత్తగా ఇంటికి తీసుకురావడం చేస్తూ బీకాం కంపూటర్స్ పూర్తీ చేయించింది. ఏదైనా ఉద్యోగ ప్రయత్నం చేయచ్చు అనుకొంటున్న తరుణంలో అతనికి కండరాల వ్యాధి కదలలేని స్థితికి చేర్చింది. పోలియోకు తోడు కుడి కాలికి ఆ వ్యాధి సోకడంతో కాలు కదిపితే భరించలేని నొప్పి వస్తుండటంతో పరుపుకే పరిమితమయ్యాడు. అతనికి సపర్యలు చేసి చేసి తల్లి కూడా నడుము నొప్పితో బాధపడుతుండగా కుటుంబ కష్టాలు అతని తండ్రికిపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. మూడేళ్లుగా తేజేష్‌బాబు కష్టం చూసి ఏడ్చి ఏడ్చి తమకంట్లో కన్నీరు ఇంకిపోయాయిగాని తమ కష్టాలు మాత్రం దూరం కాలేదని మానవతా వాదులు ఆర్థిక సాయం అందిస్తే ఆసుపత్రిలో చేర్చి చికిత్స చేయిస్తామని తల్లి నాగలక్ష్మి వేడుకొంటోంది. సాయం చేయదలచినవారు కెనరా బ్యాంకు ఖాతా సంఖ్య 31232200108693కు డబ్బు పంపాలని (మొబైల్ నంబర్ 94936 89226) కోరుతోంది.

**ఏనాడు ఆత్మస్థైర్యాన్ని కోల్పోలేదు:**

ఎన్ని కష్టాలొచ్చినా పోలియోతో అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితులు ఎదుర్కొన్నా ఏనాడు ఆత్మస్థైర్యాన్ని కోల్పోలేదని తల్లి అందించి ప్రోత్సాహంతో కష్టపడి బీకాం కంప్యూటర్ పూర్తీ చేశానని అంటున్నాడు 23 సంవత్సరాల తేజేష్‌బాబు. అయితే ఉన్నఫలంగా తనకు అంతుచిక్కని వ్యాధి సోకడంతో కదలలేని స్థితికి చేరుకున్నానని వ్యాధి నిర్ధారణ చేసుకోవడానికి కూడా ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోలేని ఆర్థిక దుస్థిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తన ఆరోగ్య స్థితిపై గూగుల్‌లో సెర్చ్ చేస్తే ఇది అరుదైన కండరాల వ్యాధని ఎవరో ఒకరికి సోకుతుందని తెలుస్తోందని అంటున్నాడు. తన చికిత్సకు సాయం అందిస్తే కోలుకొని ఉద్యోగంచేసి సంపాధించి తనను ఇన్నాళ్లు కంటికి రెప్పలా కాపాడుకున్న తల్లిదండ్రులను బాగా చూసుకుంటానని చెబుతున్నాడు. నా తల్లే నాకు గురువు, దైవం సర్వశ్వమని అమెకు ఎంత సేవ చేసినా తక్కువే అవుతుందని అంటున్నాడు.



చౌడేశ్వరి కాలనీలోని పాత ఇల్లు

## ఘనంగా ప్రకృతి చికిత్స దినోత్సవం

**-ఆయుష్, ఆయుర్, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహణ**

**ఉరవకొండ, నవంబర్ 20 ప్రభాతవార్త**



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎస్.యండి.షఫీ

పట్టణంలోని లయన్స్‌క్లబ్ స్టడీ, యోగ కేంద్రం ఆవరణలో ఆదివారం జాతీయ ప్రకృతి చికిత్స దినోత్సవం ఘనంగా జరిగింది. ఆయుష్, ఆయుర్, లయన్స్‌క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమానికి మంచి స్పందన కనిపించింది. ఉదయం సైకిల్ ర్యాలీ స్థానిక పోలీస్ గ్రౌండ్ నుండి క్లాకటవర్ వరకు కొనసాగగా ర్యాలీను ఎస్ఐ టి.పి.వెంకట స్వామి ప్రారం భించారు. ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో సీనియర్ వైద్యాధికారి డాక్టర్ ఎస్.యండి.షఫీ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరంలో దగ్గు, జలుబు, అలర్జీ, తుమ్ములు, ఆయాసం, తలనొప్పి తదితర రుగ్మతలతో బాధపడుతున్న 65 మందికి పంచకర్మ చికిత్సలో భాగంగా నస్యకర్మ ముక్కులో ఆయుర్వేద ఔషధ తైలము నాసల్ డ్రాప్స్ వేశారు. ప్రకృతి వైద్యంపై న్యాచురోపతి వైద్యులు డాక్టర్ ప్రసాద్ అవగాహన కలి ్పంచారు. ఈ కార్య క్రమంలో చిరోప్రాక్టీషనర్ డాక్టర్ కాశీం, దంత వైద్యులు డాక్టర్ హర్షవర్ధన్, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున, రీజినల్ చైర్మెన్ కొమ్మసాని బాలచంద్ర, ప్రతినిధి టి.గణేష్‌బాబు, ఆయుర్ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తాటికొండ వెంకట్, ఆయుర్వేద వైద్యశాల కంపౌండర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## బస్సుల కొరతతో ప్రయాణీకుల ఇబ్బందులు

**ఉరవకొండ, నవంబర్ 20 ప్రభాతవార్త**



ఒకే బస్సు రావడంతో ఎగబడుతున్న ప్రయాణీకులు

ఉరవకొండ నుండి గుంతకల్లుకు వెళ్లే బస్సులు లేక ఆదివారం సాయంత్రం ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం చీకటి పడిన తరువాత నుండి దాదాపు 45 నిమిషాల పాటు గుంతకల్లు వైపునకు వెళ్లే ఒక్క బస్సు కూడా ఆర్టీసీ బస్టాండుకు రాకపోవడంతో విపరీతమైన చలిలో పిల్లజల్లాతో ప్రయాణీకులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఆ తరువాత ఒకే ఒక బస్సు రావడంతో అందులో ఎక్కడానికి తోసుకోవాల్సి వచ్చింది. గుంతకల్లు రూట్‌లో ప్రతి 10 నిమిషాలకు ఒకటి చొప్పున బస్సులు అందుబాటులో ఉంటాయని ఆదివారం కావడం, ఆ రూట్‌లో వెళ్లే ఒక బస్సు మరమ్మతులకు గురికావడంతో ఈరోజు ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు తెలిపారు.

## వార్డు సభ్యుడి ఇంటికొచ్చిన ఎంపీ గోరంట్ల మాధవ్

**ఉరవకొండ, నవంబర్ 20 ప్రభాతవార్త**



ఎంపీ గోరంట్ల మాధవ్‌తో వశికేరి మల్లికార్జున తదితరులు

హిందూపురం పార్లమెంటు సభ్యుడు గోరంట్ల మాధవ్ ఆదివారం ఉరవకొండ పట్టణంలోని మేజర్ గ్రామ పంచాయతీ 15వ వార్డు సభ్యుడు వశికేరి మల్లికార్జున ఇంటికి వచ్చారు. ఆయన కర్నూల్ జిల్లా ఆలూరుకు వెళుతూ మార్గమధ్యంలో వార్డు సభ్యుడి ఇంటికివచ్చి అక్కడే ఫలహారం స్వీకరించి తనను కలవడానికి వచ్చిన వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీను వార్డు సభ్యుడు వశికేరి మల్లికార్జున శాలువాకప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు.

## శ్రీ క్షేత్రంలో కొనసాగిన కార్తీక వన భోజనాలు

**ఉరవకొండ, నవంబర్ 20 ప్రభాతవార్త**



కార్తీక దీపోత్సవం దృశ్యం

మండల పరిధిలోని లత్తవరం గ్రామంలోని శ్రీ క్షేత్రం ఉమామహేశ్వర ఆశ్రమంలో కార్తీక మాసం 4వ ఆదివారం కార్తీక వన భోజనాలు కొనసాగాయి. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వందలాది మంది భక్తులు కుటుంబ సమేతంగా క్షేత్రాన్ని సందర్శించి శ్రీ చంద్రమౌళీశ్వరస్వామి, శ్రీ శంఖరానందగిరి స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడ కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం క్షేత్రం ఆవరణలోని ఉసిరి చెట్టు, నాగుల విగ్రహాలవద్ద దీపాలు వెలిగించి అక్కడే తమ వెంట తెచ్చుకున్న వివిధ రకాల వంటలను ఆరగించి ఆటపాటలతో సంతోషంగా గడిపారు. కాగా మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం రాత్రి కార్తీక దీపోత్సవం వైభవంగా జరిగింది. వందలాది మంది భక్తులు ప్రధానాలయం ముందుగల ధ్వజస్తంభాలవద్ద కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

## ముగిసిన గ్రంధాలయ వారోత్సవాలు



పుస్తకాలు చూపుతున్న గ్రంధాలయ అధికారి వై.ప్రతాప్‌రెడ్డి, విద్యార్థులు

**ఉరవకొండ, నవంబర్ 20 ప్రభాతవార్త**

ఉరవకొండ పట్టణంలోని శాఖా గ్రంధాలయంలో ఈనెల 14వ తేదీ నుండి జరుగుతున్న 55వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా గ్రంధాలయ అధికారి వై.ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ వారోత్సవాల్లో విద్యార్థినీ విద్యార్థులకు పుస్తకాలపట్ల ఆసక్తి పెంపొందించడానికి గ్రంధాలయంపట్ల సంపూర్ణ అవగాహన కల్పించడానికి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఉయ్ లవ్ రీడింగ్ ప్రోగ్రాం, గ్రంధాలయ సభ్యత్వము, సెమినార్లు ఏర్పాటుచేసి సమాజంలో గ్రంధాలయాల పాత్ర గూర్చి వివరించామన్నారు. విద్యార్థుల్లో పోటీ తత్వం పెంపొందించడానికి వివిధ రకాల ఆటలపోటీలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందించామని వివరించారు.

## సోషల్ మీడియాలో వార్త అవాస్తవం

**బత్తలపల్లి, నవంబర్ 20 ప్రభాతవార్త**

ఆర్డీటి ఆసుపత్రిలో గుండె సమస్యలకు ఉచిత క్యాంపు అంటూ వస్తున్న సోషియల్ మీడియా వార్త అవాస్తవమని, ఎవ్వరూ దానిని నమ్మవద్దని ఆర్డీటి ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా సోషియల్ మీడియాలో ఎవరో దీనిని ప్రచారం చేస్తున్నారని, ఆ వార్త పూర్తీగా అవాస్తవమన్నారు. సంస్థ ఎటువంటి నిర్ణయము తీసుకోలేదన్నారు. ఎదైనా విషయముంటే పత్రికా ముఖంగా తెలియజేస్తామన్నారు. కొందరు ఈ వార్తను నమ్మి సుదూర ప్రాంతాల నుండి వచ్చి ఇబ్బందులు పడకూడదనే పత్రికా ముఖంగా ఈ వార్తను ఖండిస్తూ వివరణ ఇస్తున్నామన్నారు.

